సాక్షి
వికారాబాద్
ఆదివారం । 10 । ఆగస్టు । 2025



మందుల్లేవ్!

కడ్తాల్ మండలంలో మూగజీవాలకు సరైన వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయి. రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. 8లో▸



బషీరా'బాధల్'!

నిజాం కాలంలో బషీరా'బాద్‌షా'గా వెలుగొందిన బషీరాబాద్ మండలం ప్రస్తుతం బషీరా'బాధ'లుగా మారింది. 8లో▸



సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్ పేర్కొన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

లాభాల బాటలో ఆర్టీసీ

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



ఆర్టీసీ బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తదితరులు

పరిగి: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం పరిగి పట్టణానికి వచ్చిన ఐదు కొత్త ఆర్టీసీ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఆర్టీసీ లాభాల బాటలో నడుస్తోందన్నారు. ఎన్నికల హామీలను ఏడాదిలో నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని ఆరోపించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. అనంతరం లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో డీఎం సుఖేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాం రెడ్డి, వైస్ చైర్మన్ అయూబ్, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, నాయకులు చిన్న నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అందుబాటులో ఉండాలి

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



కేక్ కట్ చేస్తున్న నర్సింలు

బంట్వారం: వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సూచించారు. మర్పల్లి ఏఎంసీ డైరెక్టర్ శాకం నర్సింలు జన్మదినాన్ని పురస్కరించుకుని చైర్మన్ మహేందర్‌రెడ్డితో కలిసి శనివారం వికారాబాద్ క్యాంపు కార్యాలయంలో స్పీకర్ ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. పాలకవర్గం రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, నాయకులు సుధాకర్‌రెడ్డి, హఫీజ్, కిషన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యూత్‌కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

పూడూరు: కాంగ్రెస్ ప్రభుత్వం యువతను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తోందని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల సతీష్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మన్నేగూడ పార్టీ కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతను చైతన్యం చేసి పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సూచించారు. అనంతరం పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు శ్రీనివాస్, అజీం పటేల్, సైఫ్‌ఖాన్, యాదగిరి గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేందర్, నాయకులు రాములు నాయక్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి

మర్పల్లి: అర్హులైన అన్నదాతలు ఈ నెల 13వ తేదీ వరకు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని మర్పల్లి ఏఓ శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 5వ తేదీలోపు భూభారతిలో కొత్తగా పట్టా పాసుపుస్తకం పొంది, దానిపై తహసీల్దార్ డిజిటల్ సంతకం అయిన 18 నుంచి 59 సంవత్సరాల లోపు రైతులు అర్హులన్నారు. దరఖాస్తు ఫారంతో పాటు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలు జత చేసి రైతు వేదికల్లో ఏఈఓలు లేదా మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆశావహుల్లో ఉత్కంఠ

'స్థానిక' పోటీకి సిద్ధమవుతున్న ఆయా పార్టీల నాయకులు



- ఎన్నికల నోటిఫికేషన్ కోసం ఎదురుచూపులు
- ఏర్పాట్లలో నిమగ్నమైన యంత్రాంగం
- జిల్లాలో గ్రామ పంచాయతీలు 594
- వార్డులు 5,058
- మొత్తం ఓటర్లు 6,99,894 మంది

వికారాబాద్: త్వరలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తారనే సంకేతాలు వెలువడటంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. తొలుత పంచాయతీ, ఆ తర్వాత పార్టీ గుర్తులపై నిర్వహించే ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సర్పంచుల పదవీ కాలం ముగిసి ఏడాదిన్నర దాటింది. ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. తాజాగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, బ్యాలెట్ బాక్సులు సమకూర్చుకోవడం వంటి పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. అన్ని పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించి ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, చనిపోయిన వారి పేర్ల తొలగింపు, పాత ఫొటోల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయడం వంటి వాటిపై సలహాలు తీసుకుంటున్నారు. బూత్‌ల వారీగా ఏజెంట్లను నియమించుకోవాలని, వారి జాబితాను ఎన్నికల కమిషన్‌కు పంపి ఆమోదం పొందాలని సూచిస్తున్నారు. ఎన్నికల కోడ్ ఎప్పుడైనా రావచ్చనే సంకేతాలు ఉండటంతో అందుకు యంత్రాంగం సిద్ధమైంది. జిల్లాలో మొత్తం 6,99,894 మంది ఓటర్లు ఉండగా అందులో 3,44,963మంది పురుషులు, 3,54,912 మంది స్త్రీలు, 19 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు.

పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు ప్రక్రియ పూర్తి

గతంలో జిల్లాలో 566 జీపీలు ఉండగా మండలాల పునర్విభజన తర్వాత ఈ సంఖ్య 585కు చేరింది. పక్క జిల్లాలు నారాయణపేట్, మహబూబ్‌నగర్ నుంచి మరి కొన్ని పంచాయతీలు జిల్లాలో కలవడంతో ఈ సంఖ్య మరింత పెరిగి 594కు చేరింది. వీటి పరిధిలో 5,058 వార్డులు ఉన్నాయి.గత అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ స్టేషన్లను సిద్ధం చేయగా.. వాటికి అదనంగా గ్రామాల వారీగా మరి కొన్ని అవసరమని అధికారులు గుర్తించారు. ఓటర్లను సైతం వార్డుల వారీగా విభజించారు. 1,200 మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉంటే మరో పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

మద్దతు కూడగట్టుకుంటున్న నేతలు

జిల్లాలో వంద శాతం ఎస్టీ జనాభా ఉన్న పంచాయతీలను గతంలో ఆ సామాజిక వర్గానికే రిజర్వు చేశారు. దీంతో బీసీ రిజర్వేషన్లకు అన్యాయం జరిగిందనే వాదన కూడా తెరపైకి వచ్చింది. ఇదిలా ఉండగా ఎన్నికల బరిలో నిలవాలనుకున్న నేతలు గ్రూపులు, వర్గాలను కూడగట్టుకునే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఆయా వర్గాల నుంచి మద్దతు కోరుతున్నారు.

మండలాల వారీగా గ్రామ పంచాయతీలు, వార్డుల సంఖ్య

మండలం పేరు	జీపీలు	వార్డులు
వికారాబాద్	21	182
ధారూరు	34	286
మోమిన్‌పేట్	29	256
బంట్వారం	12	106
మర్పల్లి	29	264
కోట్‌పల్లి	18	150
తాండూరు	33	290
బషీరాబాద్	39	312
యాలాల	39	318
పెద్దేముల్	38	308
కొడంగల్	25	222
దౌల్తాబాద్	34	298
బొంరాస్‌పేట్	35	292
దుద్యాల్	19	158
పరిగి	32	268
పూడూరు	32	282
కుల్కచర్ల	33	280
చౌడాపూర్	24	202
దోమ	36	308
నవాబుపేట	32	276

సిద్ధంగా ఉన్నాం



స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చినా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. ఏయే మండలంలో ఎన్ని జీపీలు.. ఎన్ని వార్డులు.. ఎంత మంది ఓటర్లు ఉన్నారనే సమాచారం ఉంది, దాని ఆధారంగా పోలింగ్ స్టేషన్లను గుర్తించాం.

– సుధీర్, అడిషనల్ కలెక్టర్(స్థానిక సంస్థలు)



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు రాఖీలు కట్టిన అక్కలు ఉదయరాణి, శోభ, రేణుక, చెల్లెళ్లు వీణావాణి, ప్రియదర్శిని

రాఖీ కట్టి.. అనుబంధాన్ని చాటి

ఆత్మీయ అనుబంధాలకు ప్రతీకగా నిలిచే రాఖీ వేడుకలను శనివారం జిల్లా వాసులు ఘనంగా జరుపుకొన్నారు. ఆడపడుచులు తమ అన్నాతమ్ముళ్లకు ఆప్యాయంగా రాఖీలు కట్టారు. రాఖీ, మిఠాయి దుకాణాలు కొనుగోళ్లతో కిటకిటలాడాయి. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు కిక్కిరిసి పోయాయి. రహదారులపై రద్దీ నెలకొంది. ఎక్కడ చూసినా సందడి వాతావరణం కనిపించింది.



తాండూరు: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి రాఖీ కడుతున్న మాజీ వైస్ ఎంపీపీ మధులత



పరిగి: ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి రాఖీ కడుతున్న మహిళా నాయకురాళ్లు



స్వామివారికి లక్ష తులసీ దళాలతో అర్చన చేస్తున్న అర్చకులు

లక్ష్మీపతికి లక్ష తులసీ దళార్చన

కొడంగల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన కొడంగల్ పట్టణంలోని పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీపతికి శనివారం లక్ష తులసీ దళాలతో అర్చన నిర్వహించారు. ప్రత్యేకంగా తెప్పించిన పూలు, తులసీ దళాలతో అమ్మవారు, స్వామివారి మూల మూర్తులకు విశేష అలంకరణ చేశారు. పాతిక మంది బ్రాహ్మణులు విష్ణు సహస్ర నామావళి పఠించారు. శ్రావణమాసం మూడో శనివారం కావడంతో శ్రీవారి మూలమూర్తికి అభిషేకం, తోమాల సేవ, అలంకరణ చేశారు. విష్ణు సహస్ర నామార్చన, ప్రసాద నైవేద్యం, మహా మంగళ హారతి తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించారు. ఎన్‌సీసీ విద్యార్థులు సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టణంలోని చితారు పేరుమాళ్ల ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు స్వామివారికి అభిషేకం చేశారు. పట్టణంలోని శాంతినగర్ కాలనీలో కొలువుదీరిన అభయాంజనేయ స్వామికి అభిషేకం చేశారు.

పూల ధరలకు రెక్కలు

శ్రావణమాసం, పెళ్లిళ్ల సీజన్ కావడంతో..

- పూల రకాలను బట్టి రూ.200 నుంచి రూ.2,500 వరకు..

నవాబుపేట: ఓ వైపు శ్రావణమాసం పూజలు.. మరో వైపు పెళ్లిళ్ల సీజన్ కావడంతో పూల ధరలకు రెక్కలు వచ్చాయి. ఈ నెల పవిత్ర మాసం కావడంతో పూల వినియోగం భారీగా ఉంది. మహిళలు అమ్మవారిని వివిధ రకాల పూలతో కొలుస్తుంటారు. గత శుక్రవారం వరలక్ష్మీ వ్రతం నాటి నుంచి పూల రేట్లు మరింత పెరిగాయి. పెళ్లి వేదికను పూలతో అలంకరించడానికి సుమారు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు తీసుకుంటున్నట్లు తెలిసింది. ఆర్థికంగా ఉన్నవారు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. వధూవరులు మెడలో ధరించే పూలమాల ధర రూ.2 వేలకు పైగా ధర పలుకుతోంది. సాధారణ రోజులు ఒక మాల రూ.200 నుంచి రూ.500ల వరకే ఉంటుంది. ఇక బంతి, చామంతి, మల్లె పూల దండలైతే రూ.1000 పైనే. లిల్లీ పూల దండకూడా భారీ ధర పలుకుతోంది. వారం రోజుల క్రితం మూర పూలు రూ.20లకు ఇచ్చేవారు.. ప్రస్తుతం రూ.50 తీసుకుంటున్నారు. కిలో బంతి పూలు రూ.120 నుంచి రూ.150 పలుకుతున్నాయి. చామంతి కిలోకి రూ.300 నుంచి రూ.500 వరకు.. లిల్లీ పూలు కిలోకి రూ.600 నుంచి రూ.800 వరకు, కనకాంబరాలు కిలోకి రూ.2వేల నుంచి రూ.2,500 వరకు, గులాబీ కిలో రూ. 250 నుంచి రూ.400 వరకు ధర పలుకుతున్నాయి. ధరలు విపరీతంగా పెరగడంతో మహిళలు ఆందోళన చెందుతున్నారు.



నూతన నియామకం

తాండూరు: తాండూరు హిందూ ఉత్సవ కేంద్ర సమితి అధ్యక్ష, కార్యదర్శులను పాతవారికే కట్టబెట్టారు. గౌరవ అధ్యక్షుడిగా సందల్ రాజుగౌడ్, అధ్యక్షుడిగా మున్సిపల్ మాజీ చైర్మన్ తాటికొండ స్వప్న పరిమళ్, ప్రధాన కార్యదర్శిగా పట్లోళ్ల నర్సింహులు, కోశాధికారిగా రొంపల్లి సంతోష్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. త్వరలో కార్యవర్గ సభ్యులను ప్రకటించనున్నారు.

నేటి నుంచి ఆరాధనోత్సవాలు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని శ్రీ రాఘవేంద్ర స్వామి ఆలయంలో ఆదివారం నుంచి 3 రోజుల పాటు ఆరాధన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు శనివారం తెలిపారు. ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, 9 గంటలకు పంచామృతాభిషేకం, 10గంటలకు అలంకరణ సేవ, 11 గంటలకు గురుపూజ, 12 గంటలకు అన్నదానం ఉంటుందన్నారు. సాయంత్రం 6.30గంటలకు పల్లకీ సేవ ఉంటుందని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి



భాస్యనాయక్ (ఫైల్)

కుల్కచర్ల: పొలం వద్ద విద్యుత్ పనులు పరిశీలిస్తున్న యువరైతు కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఈ ఘటన శనివారం కుల్కచర్ల మండలంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. బిందెంగడ్డ గ్రామ పంచాయతీ చింతల్‌కుంట తండాకు చెందిన నేనావత్ భాస్యనాయక్ మధ్యాహ్నం పొలం వద్ద బోరు మోటారు సమస్య తలెత్తింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి విద్యుత్ పనులను పరిశీలిస్తున్న క్రమంలో షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన కుటుంబీకులు అతన్ని మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నట్లుగా గ్రామస్తులు తెలిపారు.

ఆదివాసీల సంక్షేమానికి కృషి

రంగారెడ్డి డీటీడీఓ రామేశ్వరి దేవి

కడ్తాల్: ఆదివాసీ గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి (డీటీడీఓ) రామేశ్వరి దేవి అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శనివారం మండల పరిధిలోని మైసిగండి గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో పోరాట యోధుడు కొమురంభీం చిత్రపటానికి అధికారులు, ఉపాధ్యాయులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బీజేపీకి ఓటమి భయం



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

- సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య

పరిగి: కేంద్ర ఎన్నికల కమిషన్ బీజేపీ ప్రభుత్వానికి ఏజెంట్‌లా పని చేయడం రాజ్యాంగ విరుద్ధమని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య హితవు పలికారు. బీహార్‌లో ఓట్ల తొలగింపుపై శనివారం పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీహార్‌లో ఓటమి భయంతో బీజేపీ 65లక్షల అన్యమత ఓట్లను తొలగించిందన్నారు. తొలగించిన ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. బీజేపీ అడ్డదారులు తొక్కి అధికారంలోకి రావడానికి ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఆ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే ప్రజాస్వామ్య బద్ధంగా గెలవాలన్నారు. ఇప్పటికే మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లో అడ్డదారులు తొక్కి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, సత్తయ్య, రఘురాం, రాంచందర్, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన తెగల్లో నేటికీ ఆకలి చావులు

- రాజ్యాంగ ఫలాలు వారికి దక్కడం లేదు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలది నిర్లక్ష్య ధోరణి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

యాచారం: గిరిజన, ఆదివాసీ తెగల్లో నేటికీ ఆకలి చావులు తప్పడం లేదని.. స్వయంగా ఐక్యరాజ్య సమితి ఆందోళన వ్యక్తం చేసినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో మార్పు రావడం లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పేర్కొన్నారు. ప్రపంచ ఆదివాసీ, గిరిజన హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండల పరిధిలోని మంతన్‌గౌరెల్లి నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఆదివాసీ, గిరిజన తెగల్లో ఏ విధమైన మార్పు రావడం లేదని, రాజ్యాంగ ఫలాలు వారికి దక్కడం లేదని అన్నారు. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. హక్కులు, చట్టాలు, రిజర్వేషన్లు కల్పించే విషయంలో ఘోరంగా విఫలమవుతున్నాయని దుయ్యబట్టారు. నేటికీ అటవీ భూములను నమ్ముకుని జీవనోపాధి పొందుతుంటే వాటని ఆక్రమిస్తూ మనోవేదనకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అటవీ ప్రాంతంలో ప్రాజెక్టులు, ఖనిజం తవ్వకాల పేరుతో బలవంత తరలింపు జరుగుతోందన్నారు. ఇప్పటికీ తండాల్లో రోడ్డు మార్గం, విద్యుత్, తాగునీటి సౌకర్యాం లేక దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో అనేక హామీలు గుప్పిస్తూ గెలు పొందిన తర్వాత విస్మరిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసీ, గిరిజన తండాల్లో పర్యటించి వారి సమస్యలపై పోరాటానికి సిద్ధమవుతామని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ కంట్రోల్ కమిటీ చైర్మన్ డీజీ నర్సింహారావు, జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



జాన్‌వెస్లీకి రాఖీ కడుతున్న మహిళ


ఆమనగల్లులో సోదరులతో సోదరి


కడ్తాల్‌లో.. సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహారెడ్డికి రాఖీ కడుతున్న సోదరి దీపికా రెడ్డి

సెల్ఫీ విత్ రాఖీ

అక్కాచెల్లెళ్ల ఆత్మీయ వేడుక రక్షాబంధన్ శనివారం ఘనంగా జరిగింది. పర్వదినాన్ని పురస్కరించుకొని సోదరులకు సోదరీమణులు రాఖీలు కట్టారు. తోచిన కానుకలు అందజేసి అన్నదమ్ములు తోబుట్టువుల ఆశీర్వాదం తీసుకున్నారు. రాఖీ పౌర్ణమి వేడుకను మరింత ప్రత్యేకంగా చూపించాలనే ఉద్దేశంతో 'సాక్షి' సెల్ఫీ విత్ రాఖీ' పేరుతో ఫొటోలను ఆహ్వానించగా.. మంచి స్పందన లభించింది. పల్లెలు, పట్టణాల నుంచి ఆడపడుచులు అన్నదమ్ములకు రాఖీలు కడుతున్న చిత్రాలను పంచుకున్నారు.


తాండూరులో..


సరూర్‌నగర్‌లో..


మహేశ్వరంలో..


ధారూరులో..


బషీరాబాద్ వసతిగృహంలో సోదరులకు రాఖీ కడుతున్న ఆడపడుచు


కడ్తాల్‌లో.. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్ నివాసంలో

మందుల్లేవ్!

వెటర్నరీ ఆస్పత్రుల్లో మెడిసిన్ సమస్య

- పది నెలలుగా ప్రభుత్వం నుంచి నిలిచిపోయిన సరఫరా
- గత్యంతరం లేక ప్రైవేటులో తేవాలంటున్న వైద్యులు, సిబ్బంది
- సరైన వైద్యం అందక మృత్యువాత పడుతున్న మూగజీవాలు
- ఆందోళనలో రైతులు, పశుపోషకులు


గొర్రెలకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి(ఫైల్)

కడ్తాల్: కడ్తాల్‌తో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో వ్యవసాయానికి అనుబంధంగా రైతులు పశు పోషణ చేపడుతున్నారు. ముప్పై, నలభై ఏళ్లుగా పాడి పరిశ్రమతో ఉపాధి పొందుతున్నారు. పశు సంపద అదనపు ఆదాయ వనరు కావడంతో, సాగు భూమిలోని కొంత విస్తీర్ణంలో గడ్డి పెంచడం వీరికి అలవాటుగా మారింది. సొంత భూమి లేనివారు సైతం ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకం ద్వారా ఆదాయం సమకూర్చుకుంటున్నారు. ఇదిలా ఉండగా వీటికి ఏవైనా వ్యాధులు సోకితే సరైన వైద్యం అందడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వ పశు వైద్యశాలల్లో మందులు లేకపోవడం చికిత్సలకు ఇబ్బందిగా మారుతోంది. వర్షాకాలంలో పశువులకు వ్యాధులు సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ప్రస్తుతం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో పశు సంపద భారీగా ఉండటంతో వెటర్నరీ హాస్పిటాళ్లకు ఎక్కువ డిమాండ్ ఉంటుంది. ఈ నేపథ్యంలో మందుల కొరత పెద్ద సమస్యగా మారింది. తప్పని పరిస్థితుల్లో గత్యంతరం లేక, ఆర్థికంగా భారమైన ప్రైవేటుగా మందులు కొనుగోలు చేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

పశువులకు సోకే వ్యాధులు..

పశువులకు కాలన్ని బట్టి వచ్చే వ్యాధులతో పాటు, సాధారణ వ్యాధులు సోకుతాయి. ప్రస్తుతం వర్ష కాలం కావడంతో వీటి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. సాధారణ జ్వరం, పారుడు రోగం, చర్మ వ్యాధులు, గొంతు వాపు, జబ్బవాపు, గాలికుంటు, గురక, మసూచి, జీర్ణ సంబంధ వ్యాధులు, నోట్లో పుండ్లు పడుతుంటాయి.

నిలిచిన మందుల సరఫరా..

పశు సంవర్ధక శాఖ అధికారులు ఏడాదికి నాలుగు విడతల్లో వెటర్నరీ ఆస్పత్రులకు మందులు సరఫరా చేస్తుంది. మండల పరిధిలోని పశు సంపద ఆధారంగా వీటిని పంపిణీ ఉంటుంది. కానీ గతేడాది అక్టోబర్ నుంచి మందుల సరఫరా పూర్తి స్థాయిలో నిలిచిపోయింది. దీంతో మూగజీవాలకు రోగాలొస్తే మందులు అందుబాటులో ఉండటం లేదు.

అవగాహన అంతంతే..

పశువులకు వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించేందుకు అవసరమైన కార్యక్రమాలు నిర్వహించడం లేదు. సీజనల్ వ్యాక్సిన్లు వేసే సమయంలో రైతులకు ఒకటి, రెండు మాటలు చెప్పి మమ అనిపిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఫలితంగా వ్యాధులపై సరైన అవగాహన లేక మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి.

సబ్ సెంటర్లు తక్కువే..

మండలంలో 24 జీపీలు ఉండగా, కడ్తాల్‌లో పశు వైద్య కేంద్రం ఉంది. మండల పరిధిలోని 5 గ్రామాల్లో సబ్ సెంటర్లు ఉన్నాయి. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌తో పాటు, ఎల్ఎస్ఏ, జేవీఓలు ముగ్గురు, ఆఫీస్ సబార్డినేట్లు నలుగురు విధులు నిర్వర్తిస్తున్నారు. వెటర్నరీ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ముద్వీన్, చల్లంపల్లి గ్రామాల్లో సరిపడా సిబ్బంది ఉండగా, రావిచేడ్‌లో సబార్డినేట్ పోస్ట్ ఖాళీగానే ఉంది. అన్మాస్‌పల్లిలో పశువైద్య ఉప కేంద్ర భవనం శిథిలావస్థకు చేరుకుని, సేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయి. ముద్వీన్, కర్కల్‌పహాడ్ గ్రామాల్లో భవనాలు లేవు. పూర్తి స్థాయి సేవలు అందాలంటే పంచాయతీకి ఒకటి చొప్పున సబ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వ పశువైద్యశాలల్లో మందులు అందుబాటులో ఉండటం లేదు. ఇదే అదనుగా భావిస్తున్న ప్రైవేటు మెడికల్ షాపుల యజమానులు వారికి నచ్చిన ధరలకు విక్రయిస్తున్నారు.

మండలంలో పశు సంపద

ఆవులు	17,314
గేదెలు	2,017
గొర్రెలు	16,643
మేకలు	7,868
కోళ్లు	7,98,491
కుక్కలు	1.561
పందులు	1,127

ప్రభుత్వం దృష్టిసారించాలి



పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేయాలి. ప్రస్తుతం పశు పోషణ తలకు మించిన భారంగా మారింది. ప్రభుత్వ పశువైద్య కేంద్రంలో మందులు కూడా దొరకని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రైవేట్‌లో కొనుగోలు చేయడం భారంగా మారింది. – కదారి రామకృష్ణ, పశు పోషకుడు, కడ్తాల్

ఇండెంట్ పెట్టాం



పశువులకు అవసరమైన మందులు ప్రస్తుతం పూర్తి స్థాయిలో అందుబాటులో లేవు. ఇటీవలే ఇండెంట్ పెట్టాం. త్వరలోనే మందులు సరఫరా అవుతాయి. మూగజీవాలకు వ్యాక్సిన్లు వేస్తున్నాం. రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. – డాక్టర్ భానునాయక్, మండల పశువైద్యాధికారి

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దుర్మరణం

గచ్చిబౌలి: అదుపు తప్పి కారు పల్టీ కొట్టడంతో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దుర్మరణం పాలైన ఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన మేరకు.. ఛత్తీస్‌ఘడ్ రాయపూర్‌కు చెందిన రూపక్ త్రిపాఠి(30) మాదాపూర్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. కేపీహెచ్‌బీలో తమ్ముడు శాశ్వత్ త్రిపాఠితో కలిసి నివాసం ఉంటున్నారు. స్నేహితులతో కలిసి ఎర్టిగా కారులో కేపీహెచ్‌బీ నుంచి నాలెడ్జ్ సిటీకి వెళుతుండా టీ హబ్ రోడ్డులో శనివారం తెల్లవారు జామున 4.30 గంటల సమయంలో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. నాలుగు పల్టీలు కొట్టడంతో బెలూన్ తెరుచుకున్నప్పటికీ డ్రైవింగ్ చేస్తున్న రూపక్ త్రిపాఠి తలకు తీవ్ర గాయాలయ్యాయి. మాదాపూర్‌లోని మెడికొవర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ కొద్ది సేపటికే మృతి చెందాడు. కారులో ఉన్న సోదరునితో పాటు స్నేహితులు వైభవ్ పాటిల్, ఇషాన్ త్రిపాఠి, ఎస్ రాజ్ సింగ్‌లు క్షేమంగా బయటపడ్డారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూనే ఇటీవల రూపక్ త్రిపాఠి మొబైల్ యాప్‌ను డెవలప్ చేశాడు. యాప్‌ను లాంచ్ చేయాల్సి ఉందని చెప్పి ఛత్తీస్‌ఘడ్ నుంచి వారం రోజుల క్రితం ముగ్గురు స్నేహితులను పిలిపించుకున్నాడు. తెల్లవారు జామున ఐటీ కారిడార్ చూసేందుకు వెళుతూ కారు అదుపు తప్పడంతో రూపక్ త్రిపాఠి తిరిగి రాని లోకాలు వెళ్లాడు.కారు ముందు చక్రం ఊడిపోయి నుజ్జునుజ్జు అయ్యింది.

బషీరా'బాధ'ల్!

సరిహద్దు మండలం.. సమస్యల నిలయం

- పంచాయతీల్లో పడకేసిన పాలన
- అంతర్గత రోడ్లు, మురుగు కాలువలు లేక అవస్థలు
- తండాలకు వెళ్లని ఆర్టీసీ బస్సులు, అంబులెన్సులు
- నిరాదరణకు గురవుతున్న వ్యవసాయ రంగం
- ఉపాధి లేక కార్మిక, కర్షక కుటుంబాల వలస
- 39 పంచాయతీలు.. 41 వేల ఓటర్లు

బషీరాబాద్: నిజాం కాలంలో బషీరా'బాద్‌షా'గా వెలుగొందిన బషీరాబాద్ మండలం ప్రస్తుతం బషీరా'బాధ'లుగా మారింది. స్వాతంత్రం వచ్చిన తర్వాత ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో ప్రత్యేక పాత్ర పోషించిన ఈ ప్రాంతం తాండూరు నియోజకవర్గం కేంద్రంగా ఇద్దరు మంత్రులు, ఇద్దరు ఎమ్మెల్యేలకు పురిటిగడ్డగా నిలిచింది. కర్ణాటక సరిహద్దులో ఉన్న ఈ మండలం దివంగత మంత్రులు మాణిక్‌రావు, చందుమహారాజ్ మొదలుకొని ఎమ్మెల్యేలుగా పని చేసిన ఎం.నారాయణరావు, పైలెట్ రోహిత్‌రెడ్డి ఈ ప్రాంత బిడ్డలే. నాలుగున్నర దశాబ్దాల పాటు నియోజకవర్గాన్ని పాలించినా కాలక్రమేణా పేరు గొప్ప.. ఊరు దిబ్బ చందంగా తయారైంది. ఇక్కడ 39 జీపీలతో పాటు కాశీంపూర్‌తండా, జమ్లానాయక్‌తండా, మైల్వార్‌తండా, కంసాన్‌పల్లి తండాలున్నాయి. 41 వేల ఓటర్లు కలిగిన ఈ ప్రాంతం తాండూరు రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తోంది.

వర్షాధార పంటలే దిక్కు

తొంభైశాతం మందికి వ్యవసాయమే ఆదాయవనరు. ఇక్కడ సాగుకు యోగ్యమైన 38,417 ఎకరాల భూములున్నాయి. నీటి సౌకర్యం లేక వర్షాధార పంటలైన పత్తి, కంది, మినుము, పెసర, జొన్న, శనగ వంటివి సాగుచేస్తున్నారు. మండలంలోని 51 చెరువులు, కుంటల కింద 2,338 ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. వీటిలో 500 ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతోంది. దామర్‌చెడ్, కొత్లాపూర్, అల్లాపూర్, రెడ్డిఘణాపూర్, కాశీంపూర్, మల్కన్‌గిరి, కొర్విచెడ్ గ్రామాల్లో రైతులు బోరుబావుల కింద వరి, వేరుశనగ సాగుచేస్తున్నారు.

సాక్షి మండల వాచ్

పాలన పడక

ప్రత్యేక అధికారుల పాలనలో పల్లెలు పడకేశాయి. స్పెషలాఫీసర్లు పదిహేను రోజులకు ఒకసారి కూడా గ్రామాలకు రావడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందాల్సిన నిధులు పత్తా లేవు. దీంతో చిన్నచిన్న సమస్యలు కూడా తీరడం లేదు. మేజర్ జీపీలైన బషీరాబాద్, జీవన్గీ, మైల్వార్, ఎక్మాయి, కాశీంపూర్, మంతట్టి, దామర్‌చెడ్, నవల్గాలో నేటికి అంతర్గత రోడ్లు, మురుగు కాల్వలు సంపూర్ణంగా కాలేవు. దీంతో రోడ్లపైనే మురుగు పారుతోంది. వీధి దీపాలు వెలగక కాలనీల్లో చీకట్లు అలుముకుంటున్నాయి. అంతర్గత రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. చిన్న జీపీల పైన రెడ్డిఘనాపూర్, కంపసాపల్లి, గొట్టికకలాన్, గొట్టిగఖుర్ధు, నావంద్గీ, గంగ్వార్, మల్కన్‌గిరి, కొర్విచెడ్‌గని, కొర్విచెడ్, మాసన్‌పల్లి, మర్పల్లి, పర్వత్‌పల్లి, నీళ్లపల్లి, జలాల్‌పూర్, ఇస్మాయిల్‌పూర్, కొత్లాపూర్, గంగ్వార్, క్యాద్గీరా, మంతన్‌గౌడ్‌తండా, మంతన్‌గౌడ్ గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. ఎస్సీ , ఎస్టీ కాలనీల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. తండాలకు ఆర్టీసీ బస్సులు వెళ్లడంలేదు. కనీసం అత్యవసర సమయంలో 108 అంబులెన్సులు కూడా రాలేని దుస్థితి నెలకొంది.


బషీరాబాద్‌లో ప్రధాన రోడ్డు దుస్థితి

ప్రధాన సమస్యలివే..

- నావంద్గీ(బషీరాబాద్) రైల్వే స్టేషన్లో హుబ్లీ ఎక్స్‌ప్రెస్, నాందేడ్‌లింక్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల ఆపడం లేదు.
- మైల్వార్ రిజర్వుడు ఫారెస్టులో అంతర్రాష్ట్ర సరిహద్దు సమస్య ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోవడంలేదు.
- కర్ణాటక రైతులు కబ్జా చేసుకున్న 286 ఎకరాల తెలంగాణ భూమిని విడిపించి తమకు ఇప్పించాలని నీళ్లపల్లి, ఇస్మాయిల్‌పూర్, జలాల్‌పూర్ రైతులు చాన్నాళ్లుగా కోరుతున్నారు.
- నవల్గా నుంచి నీళ్లపల్లి క్రాసింగ్ వరకు డబుల్ రోడ్డు కలగానే మారింది.
- జీవన్గీలో సర్వేనంబర్ 162లో పట్టాదారులైన 54 మంది దళిత రైతులకు కొత్త పాసు పుస్తకాలు రాలేదు. దీంతో వీరికి ప్రభుత్వ పథకాలు అందడం లేదు.
- జీవన్గీ– కరణ్‌కోట్, జీవన్గీ– మంతట్టి రోడ్డు, మంతట్టి– నారాయణపూర్ రోడ్డు పూర్తికావడం లేదు.
- బషీరాబాద్ బస్టాండ్‌ను పునరుద్ధరించాలి.
- ఆదర్శ పాఠశాలలో హాస్టల్ భవనం నిర్మించాలి.
- బషీరాబాద్‌కు పొరుగున ఉన్న కర్ణాటకకు లింకు రోడ్లు పూర్తి చేస్తే అంతర్రాష్ట్ర రవాణా మెరుగు పడుతుంది.

పరిశ్రమలు నెలకొల్పాలి



ఇక్కడి ప్రజల్లో రైతుల తర్వాత కూలీలే అధికం. వేలాది కార్మిక కుటుంబాలు పని దొరకక ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నాయి. మండలంలోని కొర్విచెడ్, క్యాద్గీరా, నవల్గా, ఎక్మాయి, జీవన్గీలో నాపరాతి గనులున్నాయి. ఇక్కడ చిన్న తతరహా పరిశ్రమలు నెలకొల్పితే యువతకు, కార్మికులకు ఉపాధి దొరుకుతుంది.
– నర్సిములు, బషీరాబాద్

లిఫ్టులు పునరుద్ధరించాలి



కాగ్నా నదిలో ఏటా వందల క్యూసెక్కుల వరద నీరు దిగువనున్న కర్ణాటకకు తరలిపోతోంది. నదిపై ఇప్పటికే ఉన్న జీవన్గీ, నావంద్గీ, క్యాద్గీరా ఎత్తిపోతల(లిఫ్టు)ను పునరుద్ధరిస్తే 15 వందల ఎకరాలు సాగులోకి వచ్చే అవకాశం ఉంది. దీంతో రైతులు, కూలీలకు చేతినిండా పని ఉంటుంది.
– వీరన్న, రైతు, నావంద్గీ

మేజర్ జీపీల్లో ఓటర్ల వివరాలు

పంచాయతీ	పురుషులు	స్త్రీలు	మొత్తం	రిజర్వేషన్లు(2019)
బషీరాబాద్	2,815	3,052	5,867	బీసీ
జీవన్గీ	1,311	1,482	2,793	జనరల్
మైల్వార్	1,333	1,458	2,791	జీసీ
ఎక్మాయి	1,257	1,387	2,644	జీసీ
కాశీంపూర్	414	509	923	ఎస్సీ
దామర్‌చెడ్	801	854	1,655	జీసీ
మంతటి	791	871	1,662	ఎస్సీ
నవల్గా	775	872	1,647	జీసీ

450 కుటుంబాలు వలస

వ్యవసాయ భూములు లేని గిరిజన, వడ్డెర, బుడగజంగం సామాజికవర్గాలకు చెందిన 450 కుటుంబాలు హైదరాబాద్, ముంబై వలస వెళ్లాయి. కొర్విచెడ్‌గని, క్యాద్గీరా, బషీరాబాద్‌లోని జయంతికాలనీ, టాకీతండా, ఇందిరానగర్, గోసాయి కాలనీ, అల్లాపూర్(బి), బాబునాయక్‌తండా, హంక్యానాయక్‌తండా, జమ్లానాయక్‌తండా, నంద్యానాయక్‌తండా, తౌర్యానాయక్‌తండా, పర్యనాయక్‌తండా, కుప్పన్‌కోట్‌తండా, బాద్లాపూర్‌తండా, కంసాన్‌పల్లితండా, ఇస్మాయిల్‌పూర్‌తండా, కాశీంపూర్ తండాల్లో పదుల సంఖ్యలో కుటుంబాలు ఇళ్లకు తాళం వేసి చిన్నారులను వెంట తీసుకొని వలస వెళ్లాయి. వీరు పెద్ద పండుగలు, పంచాయతీ, పార్లమెంట్, శాసనసభా ఎన్నికలకు వచ్చి వెళ్తారు.


కొర్విచెడ్‌గనిలో వలసల కారణంగా తాళం పడిన ఇళ్లు

మూడు లిఫ్టులు మూత

మండలంలోని మంతట్టి, కంసాన్‌పల్లి(ఎం), జీవన్గీ, క్యాద్గీరా, గంగ్వార్, నావంద్గీ, ఇందర్‌చెడ్ గ్రామాల పరివాహక ప్రాంతాల గుండా కాగ్నానది ప్రవహిస్తోంది. 45 ఏళ్ల క్రితం జీవన్గీ, నావంద్గీ, ఇందర్‌చెడ్ వద్ద కాగ్నాపై మూడు ఎత్తిపోతల పథకాల నిర్మించారు. వీటికింద 1,750 ఎకరాలు ఆయకట్టు భూములకు 20 ఏళ్లపాటు సాగు నీరు అందించారు. పాలకులు వీటిపై శీతకన్ను వేయడంతో మూడు లిఫ్టులు మూతపడ్డాయి. గతంలో నావంద్గీ ఎత్తిపోతలకు నిధులు కేటాయించినా పనులు జరగడం లేదు. దీంతో ఆయకట్టు భూములు బీళ్లుగా మారాయి.


మూత పడిన నావంద్గీ లిఫ్టు ఇరిగేషన్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు


ఘటనా స్థలంలో స్కూటర్

దుద్యాల్: టిప్పర్ – స్కూటీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని రోటిబండ తండా సమీపంలో లగచర్ల గేటు వద్ద శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా గుండుమల్ మండలం గండిహనుమాన్(దామ్లా) తండాకు చెందిన హన్మంతు హైదరాబాద్ నుంచి సొంత గ్రామానికి స్కూటీపై వస్తున్న క్రమంలో లగచర్ల గేటు వద్ద హకీంపేట్ నుంచి ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీ కొట్టింది. దీంతో హన్మంతు తలకు తీవ్ర గాయమైంది. మహబూబ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ధారూరు: ఇటీవల కోడి, కోడి పిల్లలను చంపిన ఘటనలో చోటుచేసుకున్న గొడవలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం చనిపోయారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల ఒకటవ తేదీ మండలంలోని రాంపూర్‌తండాకు చెందిన సబావత్ మోహన్ పెంచుకుంటున్న కోడి, దాని పిల్లలు కొద్ది దూరంలోని శంకర్ ఇంటివైపు వెళ్లాయి. వాటిని చంపేశారు. పాత గొడవల నేపథ్యంలో శంకరే కోడి కోడి పిల్లలను చంపాడని మోహన్ దూషించాడు. దీంతో ఆగ్రహించిన శంకర్ అతని కుటుంబ సభ్యులు మోహన్‌పై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన మోహన్‌ను వికారాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. పోలీసులు హత్యగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉధృతంగా 'కాగ్నా'

బొంకూర్‌కు ఆగిన రాకపోకలు



తాండూరు రూరల్: భారీ వర్షాల నేపథ్యంలో మండలంలోని బిజ్వార్ – బొంకూర్ గ్రామాల మధ్య కాగ్నా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో బొంకూరుకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఈ గ్రామ ప్రజలు పెద్దేముల్ మండలం రుక్మాపూర్ మీదగా తాండూరుకు వెళ్తున్నారు. బిజ్వార్ గ్రామానికి వచ్చిన ఓ వ్యక్తి బొంకూరు వెళ్లేందుకు ప్రమాదకర వాగులో ఈత కొడుతూ అవతలి ఒడ్డునకు చేరాడు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి గ్రామాన్ని సందర్శించారు. బొంకూర్ బ్రిడ్జి పనులను సత్వరం పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించారు.